క్లుప్తంగా

విద్యుత్ సిబ్బందికి సహకరించండి

పాన్‌గల్: ప్రభుత్వం అమలు చేసే గృహజ్యోతి పథకానికి అవసమగు వివరాలను విద్యుత్ సిబ్బందికి అందించి సహకరించాలని మండల ట్రాన్స్‌కో ఏఈ చందన్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటికి వచ్చే విద్యుత్ సిబ్బందికి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ వంటి వివరాలను అందించి సహకరించాలన్నారు. ఆయా వివరాలను ఈనెల 15వ తేదీ వరకు అందించాలని లేనిచో గృహ జ్యోతి పథకం ప్రయోజనం వర్తించదన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

పాన్‌గల్: టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు యూనియన్ జిల్లా కార్యదర్శులు మురళి, లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు. గౌరవ సలహాదారులుగా శ్రీరామ్, కుర్మయ్య, గౌరవ అధ్యక్షుడిగా వెంకటేష్, అధ్యక్షుడిగా శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా రాముడు, ఉపాధ్యక్షులుగా బాలయ్య, మంజుల, సంధ్యారాణి, కోశాధికారిగా కాశన్న, కార్యదర్శులుగా కురుమూర్తి, గోపాల్, ఈశ్వర్ సాంస్కృతిక కార్యదర్శులుగా చెన్నమ్మ, గీతారాణి ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు. యూనియన్ బలోపేతం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

సైన్స్‌తోనే సుస్థిర భవిష్యత్

గోపాల్‌పేట: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం గోపాల్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అనే అంశంపై పెయింటింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాసంపై పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా పెయింటింగ్‌లో బుద్దారం గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. గోపాల్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాబులాల్ కవిత్వంలో, ఉపన్యాసంలో శైలజ, పాటల పోటీల్లో శిరీష విజేతలుగా నిలువగా.. వారిని హెచ్‌ఎం రమాకాంత్, ఉపాధ్యాయులు అభినందించారు. వీరు జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు.

టీచర్స్ డైరీ రాయాలి



వనపర్తి టౌన్: ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా టీచర్స్ డైరీని రాయాలని విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి యుగంధర్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సాంఘీక శాస్త్ర సబ్జెక్టు సముదాయ సమావేశాన్ని సందర్శించి ఉన్నత పాఠశాలల్లో అమలవుతున్న ఉన్నతి కార్యక్రమంపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తరగతి గదిలో బోధన ఉన్నతి మాడ్యూల్, సోపానాల ప్రకారం విద్యార్థుల్లో సబ్జెక్టుకు సంబంధించిన అభ్యసన ఫలితాలు సాధించాలన్నారు. అర్థవంతమైన టీఎల్‌ఎం వాడాలని, ప్రయోగవాలను, గ్రంథాలయాలను, ఐఎఫ్‌పీలను నిరంతరం వాడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల



గోపాల్‌పేట: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 11న జరగబోయే వడ్డెర ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని వనపర్తి జిల్లా వడ్డెర సంఘం గౌరవ అధ్యక్షుడు పసుపుల గోపాల్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆత్మగౌరవ సభకు సంబంధించిన గోడపత్రికను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, వడ్డెరలకు గుట్టలపై పూర్తి హక్కులు కల్పించడంతో పాటు వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి జరుపటి ఈశ్వర్, పీట కథాల్, జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య, రమేష్, బలరాం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 10వ వార్డుకు చెందిన కావలి బాలమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. వార్డు కౌన్సిలర్ జయసుధ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి సమాచారం ఇవ్వగా రూ. 5వేలను దహన సంస్కారాలకు అందించారు. ఈ మేరకు మృతదేహానికి నియోజకవర్గ సమన్వయకర్త సతీష్, చీర్ల చందర్, మధుగౌడ్ నివాళులర్పించి, రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో యాదగిరి, రవి యాదవ్, వెంకటేష్, రంజిత్, పాల రవి తదితరులు ఉన్నారు.

అమరచింత: రెండు నెలల కిందట మంజు వైన్స్ దగ్గర విద్యుత్ షాక్‌తో మృతి చెందిన తిరుమల శేఖర్ కుటుంబ సభ్యులకు రూ.1.50లక్షల నగదును వైన్‌షాపు యజమాన్యం బాధిత కుటుంబానికి అందించారు. వైన్స్ వద్ద చిరు పనులు చేసుకుంటు ప్రమాదవశాత్తు మృతి చెందిన శేఖర్ కుటుంబాన్ని ఆదుకోవాలని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో విన్నవించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు దేవరకొండ లచ్చన్న తెలిపారు. వైన్స్‌షాప్ యాజమాన్యం స్పందించి మానవతా దృక్పథంతో బుధవారం బాధిత కుటుంబానికి నగదును అందించారు.

తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు



పామిరెడ్డిపల్లిలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపీపీ రఘుప్రసాద్, మాజీ సర్పంచ్ సిద్ధయ్య

కొత్తకోట రూరల్: వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రఘుప్రసాద్, ప్రత్యేక అధికారి శ్రీరాంరెడ్డి సూచించారు. ప్రత్యేక అధికారి అధ్యక్షతన బుధవారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో దోమల బెడద తగ్గించేందుకు నీటి నిల్వలు ఉండకుండా పారిశుద్ధ్య కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైయినేజీల్లో ప్రతి నిత్యం బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు గ్రామంలో ఫాగింగ్ చేయాలన్నారు. ఎంపీఓ శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు బోరు బావులకు కొత్త మోటార్లు బిగించేందుకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో కరెంట్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఎంపీపీకి విజ్ఞప్తి చేశారు. అనంతరం కాంగ్రెస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ సిద్ధయ్య, వార్డు సభ్యులను, పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో గ్రామ అభివృద్ధికి వార్డు సభ్యులు, గ్రామస్తులు సహకరించారని, వారి ప్రోత్సాహం మరువలేనిదన్నారు. భవిష్యత్‌లో కూడా గ్రామ అభివృద్ధికి అధికారులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇందిరమ్మ, పంచాయతీ కార్యదర్శి జయమ్మ, కాంగ్రెస్ నాయకులు తిక్కన్న, శ్రీశైలం, రఘుగౌడ్, నరేష్, రైతు సమితి మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాజు అన్నారు. బుధవారం గ్రామాల్లో పారిశుద్ధ్య వారోత్సవాలను నిర్వహించారు. వారోత్సవాల్లో గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.

పాన్‌గల్: గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు గ్రామాల ప్రత్యేక అధికారులు పేర్కొన్నారు. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంతో పాటు అన్ని జీపీల్లో గ్రామ సభలను నిర్వహించి ఆయా సమస్యలపై ఆరా తీశారు. తెల్లరాళ్లపల్లితండాలో నిర్వహించిన గ్రామ సభలో జీపీ ప్రత్యేకాధికారి విద్యాసాగర్‌రెడ్డి పాల్గొని, తండాలో పర్యటించారు. తండాలో యువజన సంఘం, మహిళ సంఘాల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాంతమ్మ, పంచాయతీ కార్యదర్శి నర్మద పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు

పెబ్బేరు రూరల్: ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల సందర్భంగా వనపర్తి మండలంలోని పెద్దగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారి విజయసింహ అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండయ్య, కార్యదర్శి మల్లికార్జున్, ఏఈఓ, ఏఎన్‌ఎం, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కతలప్ప తెలిపారు. వారం రోజుల పాటు చేపట్టనున్న పలు పారిశుద్ధ్య కార్యక్రమాలపై బుధవారం మండల కేంద్రంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం 7 రోజుల పాటు అధికారులు నిర్దేశించిన విధంగా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఆ తరువాత మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రాథమిక పశువైద్య ఆరోగ్య కేంద్రం పాత భవనాన్ని వారు పరిశీలించారు. ప్రమాదభరితంగా ఉన్న ఈ భవన శిథిలాలను వెంటనే తొలగించాలని వెటర్నరీ అసిస్టెంట్ శివాజీ ఎంపీడీఓకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేష్, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, సువర్ణ, మహేశ్వరి, కమల పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని రుక్కన్నపల్లి ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు సభల్లో పాల్గొని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.



తెల్లరాళ్లపల్లితండాలో..



రుక్కన్నపల్లిలో..



గుంటిపల్లిలో..

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త: ఎస్‌ఐ



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి

కొత్తకోట రూరల్: పట్టణంలోని ఆటో డ్రైవర్లు కొత్త వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. పట్టణానికి వచ్చిన కొత్త వ్యక్తులు, అనుమానితులతో అనుసరించాల్సిన విధానంపై బుధవారం రాత్రి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. పట్టణానికి ఎవరైనా కొత్త వ్యక్తి వచ్చి తనకు ఓ సిమ్ కార్డు కావాలి నాకు తెలిసిన వ్యక్తి అని చెబితే అలాంటి వారికి సహాయం చేయవద్దన్నారు. మహిళల మెడలో చైన్స్ దొంగతనం చేసేవారు, బైక్ దొంగలు తిరుగుతున్నారని అపరిచిత, అనుమానం వచ్చిన వారు బస్టాండ్, ఇతర ప్రాంతాల్లో కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించాలని, బస్టాండ్ ఎదురుగా ఆటోలను అడ్డదిడ్డంగా ఆపొద్దని సూచించారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారికి సన్మానం



అధికారిని సన్మానిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: మండలంలోని తిప్పాయిపల్లి పంచాయతీ ప్రత్యేక అధికారి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవన్న, పంచాయతీ కార్యదర్శి గోపాల్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 6 గ్యారంటీలను ప్రజా పాలన ద్వారా ఒక్కొక్కటి ప్రజలకు చేరే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లస్వామినాయుడు, నవీన్‌గౌడ్, చాకలి రాముడు, కాశన్న, కుమ్మరి రాముడు, మన్యం, ఎద్దుల అంజి, మేకల రాముడు, శివ రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి..

మదనాపురం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన శేఖర్‌రెడ్డిని బుధవారం టీపీసీసీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అంజద్‌అలీ, రామన్‌పాడు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖదీర్, సురేందర్‌గౌడ్, ఎండీ ఖాజ, రఫీక్ తదితరులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

నిధుల కేటాయింపుపై హర్షం

గోపాల్‌పేట: తెలంగాణ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా ఉమ్మడి గోపాల్‌పేట మండలానికి రూ.3.69 కోట్లు మంజూరు కావడంపై బుధవారం ఉమ్మడి గోపాల్‌పేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి ఎన్నో ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపడుతోందని, అందులో భాగంగా ఉమ్మడి గోపాల్‌పేట మండలానికి డబ్బులు మంజూరు కావడం సంతోషకరమైన విషయమని దీనికోసం సహకరించిన ఎమ్మెల్యే మేఘారెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. గోపాల్‌పేట మండలానికి రూ.2.38 కోట్ల రూపాయలు, రేవల్లి మండలానికి రూ.1.31 కోట్ల రూపాయలు మంజూరైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రేవల్లి మండల అధ్యక్షుడు పర్వతాలు, గోపాల్‌పేట టౌన్ అధ్యక్షుడు శివన్న, నాగేశ్, వెంకట్‌రెడ్డి, శేఖర్, తెలుగు బాలయ్య, ప్రవీణ్‌కుమార్, శివ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధికి ఎన్‌ఆర్‌జీఎస్ నిధుల నుంచి రూ.1.35కోట్ల నిధులను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కేటాయించారు. గ్రామాల్లో ఈ నిధులతో అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు యాదవ్, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రాఘవేంద్రస్వామి ఆలయంలో పీఠాధిపతి

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని రాఘవేంద్రస్వామి ఆలయాన్ని పళిమార్ పీఠాధిపతి విజయేంద్ర స్వామిజీ బుధవారం సందర్శించారు. స్వామిజీకి ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్రంలో పళిమార్ పీఠానికి చెందిన పలు ఆలయాలు ఉన్నాయని వాటి అభివృద్ధి కోసం భక్తులు సహకరించాలని కోరారు. ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని స్వామిజీ అన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఆలయ నిర్వాహకులు గందూరి ప్రవీణ్‌కుమార్, బాదం వెంకటేశ్వర్లు, విశ్వేశ్వర్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



చిన్నారి ఉపాధ్యాయులతో పాఠశాల హెచ్‌ఎం

అమరచింత: తరగతి గదిలో కూర్చుని ఉపాధ్యాయుడు బోధించే విషయాలను తెలుసుకుని శ్రద్ధగా చదువుకుంటున్న విద్యార్థులు తామే ఉపాధ్యాయ పాత్ర పోషించి తోటి విద్యార్థులకు విషయాలను బోధించారు. పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు బుధవారం స్వయం పరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎంగా మనీష, ఎంఈఓగా ఇమ్రాన్, డీఈఓగా ఆదిత్య చక్కటి ప్రతిభను చూపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాలస్వామితో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం

- రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ జబ్బార్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం రాష్ట్ర నాయకుడు జబ్బార్ తదితరులు

సాక్షి, నెట్‌వర్క్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ జబ్బార్, ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ పిలుపునిచ్చారు. బుధవారం సీఐటీయూ, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్, ప్రజాసంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె-గ్రామీణ భారత్‌బంద్ నిర్వహించాలని జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్‌మోర్చా అఖిల భారతస్థాయిలో నిర్ణయించాయన్నారు. రైతుల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకొని రాతపూర్వకంగా హామీ ఇచ్చినా నేటికీ అమలుచేయక వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకుందని వివరించారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించలేదని, ఆందోళన సమయంలో చనిపోయిన 750 రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించలేదని తెలిపారు. ఉపా చట్టం పేరుతో రైతు నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లలో బంధిస్తున్నారని, వామపక్షాల ఒత్తిడితో వచ్చిన ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు పూనుకుంటుందని వివరించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు రైతుల పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించేలా చట్టం చేయాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లు 2022 ఉపసంహరించుకోవాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, వంట గ్యాస్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గించాలని సూచించారు. దేశవ్యాప్త సమ్మెలో రైతులు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

వనపర్తి మండలంలోని కడుకుంట్ల శివారులో ఉన్న బేవరేజెస్ గోదాంలో పనిచేస్తున్న హమాలీల యూనియన్ సీఐటీయూ అనుబంధం ఆధ్వర్యంలో గోదాం డిపో ఇన్‌చార్జి మేనేజర్ సుబ్బారావుకు, వీపనగండ్లలో ఎంపీడీఓ కతలప్పకు పంచాయతీ కార్మికులు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో రాము, వేణుగోపాల్, వెంకటయ్య, ఆంజనేయులు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, జంబులయ్య, మల్లేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం



పథకాలపై ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రజలంతా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వెంట నడవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, రాంరెడ్డి, సీనియర్ నాయకులు విక్రం, మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. బుధవారం మండలంలోని మానాజీపేట, మామిడిమాడ, అప్పారెడ్డిపల్లి, మల్కిమియాన్‌పల్లి, అల్లమాయపల్లి గ్రామాల్లో 'పల్లెకు పోదాం, ఇంటికి పోదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల బీజేపీ నాయకులు ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆశన్న, కొరిగెల గోపి, కిసాన్‌మోర్చా నాయకులు భద్రయ్య, మహిళామోర్చా నాయకురాలు ఈదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈదమ్మ బోనాలు



ఈదమ్మ గుడి వద్ద బోనాలతో మహిళలు

పాన్‌గల్: ఈదమ్మ దేవత ఉత్సవాలు రెండో రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల సందర్భంగా మహిళలు బోనాలను అలంకరించి ఊరేగింపుగా వెళ్లి గుడి చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. దీంతో పాటు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లను అలంకరించి గుడిచుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చిన ఆడ పిల్లలకు గాజులు వేయించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. దీంతో గాజుల దుకాణాలు మహిళలతో కిక్కిరిసిపోయాయి. జాతరలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ వేణు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు హైమావతి, రాముయాదవ్, బ్రహ్మయ్య, తహసీల్దార్ అశోక్ నాయుడు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్ల పంపిణీలో జాప్యం తగదు



నిరసన తెలుపుతున్న పింఛన్‌దారులు

పాన్‌గల్: వృద్ధులు, దివ్యాంగులకు ప్రతి నెల వచ్చే పింఛన్లను జాప్యం లేకుండా అందించాలని కోరుతూ బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాలో పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, తండా మాజీ సర్పంచ్ శాంతమ్మ మాట్లాడుతూ ప్రతి నెల అందించే పింఛన్ చివరి రోజు అందిస్తుండటం, పెండింగ్‌లో ఉన్న పింఛన్లు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి నెల అందించే పింఛన్ డబ్బులతోనే కొంత మంది జీవనం సాగిస్తున్నారన్నారు. పోస్టాఫీసు వారు ప్రతి నెల మొదటి వారంలో అందించాల్సిన పింఛన్లు నెల చివరి రోజు అందిస్తుండటంతో చాలా మంది లబ్ధిదారులు పింఛన్లు తీసుకోలేకపోతున్నారన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు పోస్టాఫీసు అధికారులకు విన్నవించినా.. వారి తీరు మారడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై మరోమారు సంబంధిత అధికారులకు విన్నవిస్తామని పంచాయతీ కార్యదర్శి నర్మద హామీ ఇచ్చారు.

'కాలపరిమితి పదవులకే.. సేవకు కాదు'



తాజా మాజీ సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్, ఎంపీపీ, సీడీసీ చైర్మన్

కొత్తకోట రూరల్: పదవులకే కాలపరిమితి అని, సేవ చేయడానికి కాలపరిమితి ఉండదని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. మండలంలోని 22 గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లకు ఎంపీపీ గుంత మౌనిక ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలోని ప్రొఫెసర్ జయశంకర్ సమావేశ మందిరంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని, ప్రజలకు ఓట్లు వేసి ఐదేళ్ల పాటు మనకు మంచి అవకాశం ఇచ్చారని ఇచ్చిన అవకాశాన్ని ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. నిరంతరం ప్రజల సేవకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, భీంరెడ్డి, ఆకుల శ్రీనివాసులు, అల్లబాషా తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: సర్పంచుల అత్యుత్తమ పనితీరుతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, వైస్‌ఎంపీపీ కోటేష్, వింగ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని గ్రామాలకు చెందిన సర్పంచ్‌లను ఎంపీడీఓ కార్యాలయంలో పూలమాలలు శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాజు, రవికుమార్‌యాదవ్, విరేశలింగం, మహబూబ్‌పాష తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు



ఉపాధ్యాయుడు రాకపోవడంతో చెట్ల కింద ఆడుకుంటున్న చిన్నారులు



ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఖాళీ కుర్చీ దర్శనం

కొత్తకోట రూరల్: మండలంలో కొందరు ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు వారి పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు మాత్రం తమ తీరును అస్సలు మార్చుకోవడం లేదు. తమ సొంత పనులు చూసుకుని పాఠశాలకు ఆలస్యంగా వస్తున్నా.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థుల చదువు అటకెక్కుతుంది. బుధవారం ఉదయం 10గంటలు కావస్తున్నా పుల్లారెడ్డి కుంటతండా ప్రాథమిక పాఠశాలకు రావాల్సిన ఉపాధ్యాయుడు రాకపోవడంతో చిన్నారులు చెట్ల కింద ఆడుకుంటూ సాక్షికి కనిపించారు. సార్ ఇంకా రాలేదా అని ప్రశ్నిస్తే ఇంకా రాలేదు.. రోజూ ఇంతే లేటుగా వస్తాడు అంటూ సమాధానం చెప్పారు. అంతే కాకుండా పాఠశాలలో గల ఆరుగురు విద్యార్థుల్లో కొందరు పక్కనే గల అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు ఉన్నారు. అంగన్‌వాడీ టీచర్, స్కూల్ ఉపాధ్యాయుడు ఇద్దరు కూడా లేటుగా వస్తుండటంతో తామంతా చెట్లకింద ఆడుకుంటామని విద్యార్థులు సమాధానం చెప్పారు. మండలంలో పాఠశాలలకు ఆలస్యంగా వెళ్లే ఉపాధ్యాయులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.